# నాటివిందు-నేటిమందు

"కప్పురభోగి వంటకము
  కమ్మని గోధుమపిండివంటయున్,
గుప్పెడు పంచదారయును
  క్రొత్తగ గాచిన యాలనేయి పెస
ర్పప్పును గొమ్మునల్లనటి
  పండులు నాలుగునైదు నంజుడుల్
అప్పలతోడ గ్రొంబెరుగు లక్ష్మణ
  వజ్ఝలయింట రూకకున్"

ఇది శ్రీనాథుడు తన క్రీడాభిరామములో ఓరుగల్లులోని పూటకూళ్ళ యింటిలో ఒక రూపాయకు (మాత్రమే) పెట్టించిన భోజనం! ఆ రోజుల్లో యేమోగాని యీ రోజుల్లో అయితేమాత్రం వాడు తప్పకుండా దివాలాతీసి తీరతాడు. లేకపోతే మాటలా? పెసరపప్పు, అరటిపళ్లు, అప్పడాలు, అప్పుడు కాచిన ఆవునెయ్యి, ఇంకా నాలుగైదు నంజుళ్లు, సరిక్రొత్త పెరుగు (అంటే తోడుపెరుగు కాబోలు) – ఇంత భోజనంపెట్టి ఆ హోటలువాడు బాగుపడతాడా?—పోనీ పడతాడయ్యా! అనలన్నీ పదార్థాలు తినగల్గిందెవడు? మామూలుగా వాడు చేసిన మూడు నాలుగు పదార్థాల్లోనే ఒకటి రెండు వదలి పెట్టేస్తామయ్యో! పూర్తిగా తినివచ్చేవాళ్లు యే ఒకళ్లిద్దరో వుంటారో వుండరో! రుచిగా లేవుగనక తినలేదంటారు కొందరు. లేకపోతే ఫలానా పుల్లిపాయకారం వేడి చేస్తుందనో, ఫలాన బెండకాయకూర వాతం చేస్తుందనో, అదీ కాకపోతే ఫలాన చేమగుంపలు అజీర్తి చేస్తాయనో, ఒంటికి పడవనో, యేదో చెబుతారు.. పోనీ ఒంటికి పడేవి, వాత పిత్త శ్లేష్మాలతో ప్రమాదం లేనివి, రుచిగా వుండేవి అయిన నాలుగు పదార్థాలు సరిగా కలుపుకు తినగలరా అని లేదు పప్పూ, కూరా కలుపుకు తింటే చాలు! పచ్చడికూడా కలిపితే 'టూ మచ్' బయటికి రాగానే సోడా, కిళ్ళీ, రిక్షా మంచి పరుపు చుట్టా కావాలి! ధుక్తాయాసం; నోట మాటకూడా రాదు.

ఇక్కడికే యిలా యేడుస్తుంటే, కప్పురభోగి వంటకం, కమ్మ గోధుమ పిండివంట, గుప్పెడు పంచదార కూడానట! ఆ కప్పురభోగివంటకం అంటే యేమిటో యింతవరకు నాకు తెలియదు. పైగా గోధుమ పిండివంట అందులోనూ కమ్మదనం! అసలు బియ్యపు పిండివంట చేస్తేచాలు. (ఇక్కడ "కమ్మదనం" అనేమాట వినిపించటానికి వీల్లేదు.) పోనీ, ఆ సంగతలా వుంచండి గుప్పెడు పంచదారేమిటి? భోజనంచేసే విస్తరిలో చిటికెడు ఉప్పు వడ్డించుకుంటారు గాని, గుప్పెడు పంచదార వడ్డించుకుంటారటండీ, యెవరైనా? తినాలనైనా?— పంచదార వీసె రూపాయన్నర అమ్ముతోంది. గుప్పెట్లో కనీసం అర్ధసేరున్నపటాను పంచదారైనా పడుతుంది. అంటే దాదాపు మూడు అణాలు—గోవిందా!. పద్యంలో ప్రాస కోసం "గుప్పెడు" అన్నాడుగాని, లేకపోతే "దోసెడు" అనేవాడే—ఇటీవల ఒక బస్తీలో నేను చూసిన ఒక హోటల్లో యేమని వ్రాసివున్నదో చెప్పమంటారా?

## పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి

"కాఫీ, టీ మినహా, పంచదార చిన్న స్పూను ఒకటికి 0-0-6"

అన్యాయం! పంచదారలోకూడా యీ హోటలువాళ్లు లాభం తియ్యాలని చూస్తున్నారు అయినా వాళ్ళనని ప్రయోజనమేముంది? మనకి బుద్ధివుండొద్దూ?

నేను భోజనం చేస్తుంటే మా అమ్మమ్మ అంటుంది "ఏమితిండిరా, మరీ పిట్టమెతుకులా? మా రోజుల్లో తవ్వెడుబియ్యం తలకి చాలేవిగావు" అని.

ఏంచేస్తాం? మనకు చేతనయింది అంతవరకే! మా తాతయ్య గుప్పెడు గుప్పెడు పూర్ణపుబూరెలనీ రెండుదవడల్లో రెండూ పెట్టి లెక్కలేకుండా వూది పారేసేవాడట. ఇప్పటికీ అలాటివాళ్ళు లేకపోలేదు. కాని స్టాండర్డు తగ్గిపోతోంది

అందుకే యీ హోటలువాళ్ళు అటూ ఇటూ కూడా బాగుపడుతున్నారు. మనకి ప్రొద్దున్నే కనీసం జతయిడ్లీ, పెసరట్టు, కాఫీ కావాలి ఈమూడూ కలిపి చేసేపని యేమిటయ్యా అంటే పదిగంటలకి మనం తినే మూడువంతల భోజనంలో హోటలువాడికి అర్ధరూపాయి మిగిల్చిపెడతాయి. అంతేగాక సాయంత్రం సినిమాకు వెళ్ళాలని హడావుడిగా చేసేభోజనంకూడా అపకారం చేస్తుంది.

అసలు వాళ్ళకత్తికి రెండువైపులాపదునే. ప్రొద్దుటి కూర రాత్రికి పచ్చడవుతుంది పప్పు సాంబారవుతుంది. మీల్సు సెక్షనులో మిగిలిపోయిన సాంబారు ఒకసారి పొయ్యెక్కి మళ్ళీ యిడ్లీతో స్నేహం చేస్తుంది; కాఫీ సెక్షనులో గారె, గట్రా కండగా మిగిలిన నూనె మీల్సుసెక్షనులో కూర "తిరగబోత"కి తయారవుతుంది పగలల్లా కాఫీసెక్షనులో మరిగి 'మక్కించి' పోయిన పాలు తెల్లవారేసరికి డుకునితో మీల్సుసెక్షనులో "పెరుగు" అనేపేరు పెట్టుకుంటుంది; ఈ పెరుగులో కొంత భాగం మళ్ళీ కాఫీసెక్షనులో ప్రవేశించి, గారెలతో కలిసి "ఆవడ" అనే పదార్థానికి చోటిస్తుంది మీల్సు సెక్షనులో కప్పులలో తోడుపెట్టిన పెరుగు పైకి నిగనిగలాడుతూ తెల్ల వెలుతురులో మంచిధీగా కనిపిస్తుంది ఒంచితే "లొడలొడ", శ్రీనాథుడి "దధి ఖండా"లకీ దీనికీ యేమాత్రం సంబంధం వుండదు

ఇక నెయ్యంటారా? చెప్పనే అక్కర్లేదు

మరి పోతే, అప్పడాలు—వీటిని గురించి చెప్పాలంటే మనవల్లకాదు. అసలివ్వికూడా విశ్వామిత్ర సృష్టిలోనివే అనుకుంటూవుంటాను లేకపోతే అంత ఘోరంగా వుండవు వాటని సృష్టించటం, భక్షించటం కూడా అరవలకే చెల్లు ఈ హోటలువాళ్ళకి అవి చవకగా, రెడీమేడ్‌గా దొరుకుతాయి; ఇంకేం కావాలి, ఇష్టమున్నా లేకపోయినా మన మొహాన వేసి రుద్దుతారు. మరి బాగుపడకేంజేస్తారు?

మరి యింతా చేసి అతడు పాపం కట్టుకోడా?" అంటే "కట్టుకో"డనే చెప్పాల్సివుంది "ఎందుచేత?" అంటే, అతడు రోజూ ప్రొద్దున్నే దేవుణ్ణి పూజిస్తాడుగనుక కనీసం డజను కొబ్బరికాయలు లక్ష్మీపటం ముందు కొడతాడు గనక రోజూ కొడతాడా? ఆహా! రోజూ కొడతాడు అదంతా భక్తేనా? అంతా భక్తి కాకపోయినా, యెల్లాగూ యిడ్లీ పచ్చడిలోకి కొబ్బరికాయలు కావాలి గనుక, ఆ కాయలన్నీ దేముడిముందే కొడతాడు. అందుచేత భుక్తి,

ముక్తి—రెండూ లభిస్తాయి అందులోనూ యింకొక విశేషమేమిటంటే, అక్కడికి వెళ్ళి మనంకూడా యిడ్లీ ఆ పచ్చడిలోనే నంజుకు తింటాం గనక, ఆ పుణ్యంలో కొంతభాగం మనకి రాకపోదని నానమ్మకం. (వరా-సాంబారుతో తింటే ఆ పుణ్యం రాదు)

* * *

అరటిపళ్ళట! తేరగా వున్నాయా, అరటిపళ్ళు మాత్రం? (మనం డబ్బులిచ్చి మనం కొనుక్కువెడితేనే ఆ హోటలువాడు అదోరక మాదిరిగా చూస్తాడు మనవంక) అసలు అరటిపళ్ళు మాత్రం మంచి వెక్కడ దొరికి ఛస్తున్నాయి? నాటికో మాటు, పళ్లకొట్టుకు వెడితే కొండముచ్చు లాంటి గెల ఒకటీ, గులాబ్ జామ్‌లాంటి గెల ఒకటీ, తుమ్మెద రెక్కలాంటి గెల వకటీ, దాని తాతమ్మలాంటిగెల ఒకటీ—ఇవ్వి తప్పితే, చూడ ముచ్చటగా పండులాటి గెల ఒక్కటీ కన్పించదు గదా? "ఇంతకంటె మంచివి లేవా?" అని మనం అన్నాం అనుకోండి, "ఓ! వున్నాయండి, కూచోండి—అరెయ్, లోపల్నుంచి ఆ గెల తీసుకొచ్చి చూపించరా, అయ్యగారికీ" అంటాడు అతడు అన్నదే తడవుగా ఆ కొట్లో కుర్రాడు గబగబా లోపలికి పరుగెత్తి సీలు వేసిన గెలఒకట బరబరా ఈడ్చుకొస్తాడు అది చేతిబుచ్చుకుని, యిహ వూపడియకుండా నే మొదలెడతాడు, పాఠం "ఫస్టాసు కాయండీ, రాత్రే చెట్టునుంచి దింపాం ... కాయ వాత్రలో జేఁయినా అలాగే వుండాలన్న మాట" అంటూ ప్రారంభించి, ఆఖరికి "దీన్ని కొట్టేకాయ ఈ మార్కెట్లోనే లేదు" పొమ్మంటాడు. సరే దానికేమిచ్చేరే, ధర చెప్పవయ్యా అంటే, ఆ గెల చేత్తో లేపి పుచ్చుకుని, దానికో పోజిచ్చి "మూడూ ముప్పావలా! పట్టుకెళ్ళిపోండి" అంటాడు—అసలు మనకొక్కటి వల్సింది డజనో అరడజనో "గెల మా కెందుకయ్యా—" అని మనమేదో చెప్పబోతుంటే అడ్డొచ్చి, "రెండొందల కాయుంటదండీ—వంద రెండుం బావలా అమ్మనే అమ్మతున్నాం-మీకొక్కబట్ట పావల్తక్కువ చాలుగు" (అక్కడికి మనమేదో అతడికి చుట్టమైనట్టు) అని, "అరెయ్, కట్టిచ్చెయ్యరా" అని ఆర్డరు చేస్తాడు. మనగోడు అతడు వినడు, బేరం కుదరనివ్వడు; అప్పుడే కట్టిచ్చెయ్యమంటాడు అతణ్ని వదిలించుకు నేసరికి తాడు తెగుతుంది మొత్తంమీద ఎన్నో అన్ని అంట గట్టకుండా వదలడు—తీరా ఆ పళ్లు తీసుకుని ఇంటికివెడితే ఆడవాళ్లు నవ్వుతారు (మళ్ళీ మాట్లాడితే తిడతారుకూడా)

ఏ నిర్భాగ్యుడైనా కొనడితో అమ్మడానికొసె సగానికి సగం రేటు కడిగి అతణ్ని మనం ఏడిపిస్తాం బుద్ధి వక్రించి మార్కెట్టుకెడితే అతడే మనల్ని యేడిపిస్తాడు అంతెందుకు? వేసంగిలో హోటలువాళ్లు అవసే చేస్తున్నారు. వాళ్లు డజను యే రూపాయిన్నరకో, ముప్పావలాకో మామిడిపళ్లు కొనటం; భోజనానికొచ్చిన ప్రతివాడికీ ఒక్కొక్క పండు తగిలించటం; పావలా వసూలు చెయ్యటం

బయట వేడా అర్ధణాకీ, మూడణాలకీ యిస్తానన్నా కాయల్ని వదిలిపెట్టి వచ్చిన మొగాడు కూడా ఇక్కడ పావలా యిచ్చి నిక్షేపంగా పుచ్చుకుంటాడు. అప్పుడుగాని జలుబునీళ్లు వదలవు గాబోలు..

కనీసం స్పెషల్ రోజునైనా అతడు అరటిపళు ఇవ్వడు. పోతే, స్పెషల్ ఒక "హాట్" అనో, ఒక "స్వీట్" అనో చేశాముంటాడు అన్ని హోటళ్ల సంగతి యేమోగాని, మా హోటల్లో మాత్రం "హాట్" అంటే "బజ్జీ!" అరటికాయబజ్జీ! సరీగా అర్థగజం పొడుగుంటుంది పైన పిండిపూత నిండుగానే వుంటుంది, చేతి బుచ్చుకుంటే మానె కారుతుంది—సారీ—నూనె కారదు; డాల్డా! డాల్డా కారుతుంది నోటపెడితే-పిండివంటమీద దేషంకూడా పుడుతుంది ఉప్పూ వుండదు, కారం వుండదు.. శ్రీనాథుడెప్పుడైనా మా హోటల్‌కి వచ్చి భోజనంచేసి వున్నట్లయితే, అలాంటి పద్యాలు జన్మలో వ్రాసేవాడు కాదేమో!

ఇక పోతే స్వీట్ అంటారా-సేమియా-లేకపోతే, అగదో "రవ్వకేసరి" అని అతడంటాడు నేను మాత్రం ఆ స్పెషల్ రోజున త్వరగా మజ్జిగ పోసుకుని లేచి వచ్చేస్తూ వుంటాను.

* *


అదిసరే! "వాలుగనైను నంజాడుల్.." నంజుకోటానికైనా? లేకపోతే జనాభాలెక్కకోసమా? ఆ ఘటోత్కచుడైనా నంజుకోవటానికి నాలుగైదు చేయించుకునేవాడా? ఆ హిడింబితల్లి చేసిపెట్టేదా? అనినా సందేహం...నంజుకోటానికే నాలుగైదు వెరైటీలు కావల్సింటే, అసలు కలుపుకుతినటానికి కెన్ని కావల్సి వుండాలి? అయితే శ్రీనాథుణ్ణి అడిగితే యెన్నైనా సప్లయి చేస్తాడనుకోండి (ఆయన సొమ్మేం పోయె? కొనాలా, పెట్టాలా?) నోటికొచ్చిన పప్పులూ, కూరలూ, పులుసులూ చార్లూ—అన్నీ రాసి పారేస్తాడు ఆఖరికి లేనిపోని వన్నీ సృష్టించికూడా రాస్తాడు.. అసలు శ్రీనాథుడు అలాంటి పిచ్చి పిచ్చి కవిత్వాలన్నీ కట్టిపెట్టిపాకశాస్త్రకళాభివృద్ధికి పూనుకుంటే యెంతో బాగుండేదేమో! దేముడు అశ్రద్ధ చేసివుంటాడుగాని, లేకపోతే అలాంటి శ్రీనాథ విరచిత "పాకశాస్త్రము" అంటూ ఒక గ్రంథం పుటే వున్నట్లయితే దాన్ని యీసరికి యూనివర్సిటీ వారు ప్రీ యూనివర్సిటీనుంచి డిగ్రీక్లాసుల వరకూ నిర్బంధంగా చదివించాలని అన్ని కాలేజిలమీదా (మగవాళ్ల కాలేజీలు కాదండోయ్!) అంతు పెట్టివుండక పోయారా? ఈపాటికి మన ఆంధ్ర మహిళలంతా పాకశాస్త్ర ప్రవీణులు కాకపోయారా?

* * *

కొత్తగ కాచిన యాల నేయి

ఈ రోజుల్లో క్రొత్తగ కాచి అవునెయ్యి కాదుగదా, గేద నెయ్యికూడా దొరకటం లేదు అసలు నెయ్యేదీ? అంతా వనస్పతి చక్కని జిడ్డు; సున్ని పిండికీ సబ్బులకీ మంచి దిమాండు. కూరలకీ అదే,

(48-వ పేజీ చూడండి)



# పక్కింటి ఇల్లాలు

మా సంభాషణ వింటూ తలుపు చాటునే నిలబడింది సుభద్రమ్మగారు.

"కాదండీ! రేపు ఉదయం చుట్టు ప్రక్కల ఇళ్ళు సోదా చేయాలని సబ్ ఇన్‌స్పెక్టరుగారు అన్నారు. అతనికి అనుమానం బయటనించి ఎవ్వరో దొంగలు రారని," అన్నాను కొంచెం బిగ్గరగా, సుభద్రమ్మగారికి స్పష్టంగా వినిపించాలని.

"మీ పిచ్చిగాని లేసిన వాళ్ళు ఇంకా ఇంట్లో పెట్టుకు కూర్చుంటారుటండీ!" అన్నాడు సుబ్బారావు.

"కూర్చోక పోతేయేం? ఇరుగు పొరుగూ ఇళ్ళవాళ్ళకు ఊళ్ళో ఎక్కడెక్కడ బంధువులూ, స్నేహితులూ ఉన్నారో తెలుసు కాని—వాళ్ళ ఇళ్ళు కూడా సోదా చేస్తారు"

"ఉహూఁ!"

మా ఈ సంభాషణంతా సుభద్రమ్మగారు సందేహం లేకుండా విన్నది. ఆమె తలుపు చాటునించి తర్వాత కదిలి పోతూండగా స్పష్టంగా చూశాను.

ఆ రాత్రి కూడా మా శారద పడుకోనే ముందు అరగంట బ్రతిమాలింది—ఇల్లు మార్చేందుకు ప్రయత్నాలు జరుపమని.

నసేమిరా వీల్లేదన్నాను.

ఇంకా సరిగా తెల్లవారక ముందే మా శారద నన్ను ఎంతో ఆదుర్దాగా లేపింది.

"ఏమిటి నీగోల" అన్నాను విసుగ్గా కళ్లు పూర్తిగా తెరవకుండానే.

"నెక్‌లెస్ దొరికిందండీ!"

"అఁ!" గబుక్కున ముసుగు తొలగించాను.

"ఆ దెయ్యం నెక్‌లెస్‌ను డ్రాయరుమీద పడేసిందండీ!"

"అఁ! నిజమా!...ఎట్లా?"

"ఏమో!"

ఆ గదిలోకి వెళ్ళి పరీక్షించాను. రాత్రి తలుపులు బిగించుకొనే పడుకున్నాము. కాని డ్రాయరుకు దగ్గరగావున్న కిటికీతలుపు మటుకు కొద్దిగా తెరచివున్నది.

ఈ పాటికి సుభద్రమ్మగారు కూడా వొచ్చారు—మా ఆనందంలో పాలుపంచుకొనేందుకు కాబోలు!

"దెయ్యం మనకు భయపడిందండీ!" అన్నది మా శారద సంతోషంతో!

"అవును" అన్నాను సుభద్రమ్మగారివంక చూస్తూ.

ఎందుకో సుభద్రమ్మగారు చటుక్కున ముఖం చిట్లించుకున్నది అపైన ఆమె 'పొయ్యిమీద కూర మాడిపోతూన్న'దని వెంటనే వెళింది.

ఆ రోజంతా సుభద్రమ్మగారు మా ఇంటి చాయలకే రాలేదు కారణం నాకు తెలియదు. మా ఆవిడకు తెలీదు. ఇట్లా మా ఇంటి మీద ఆమె అలుక బూనడం—ఇదే మొట్ట మొదటిసారి.

తర్వాత రెండు రోజులకే సుభద్రమ్మగారు ఇలు మార్చింది పండరీపురంలో బంధువుల ఇంటిప్రక్కనే అద్దెకు ఇల్లు తీసుకున్నదట

అకస్మాత్తుగా ఎన్నో యేళ్ళనించి ఆ ఇంట్లో ఉంటూన్న సుభద్రమ్మగారు-ఇల్లు మార్చటం ఆ వీధిలో అందరికీ తగనిఆశ్చర్యం వేసింది.

కాని నాకు వెయ్యలేదు.

కారణం ఏమిటో మా శారద ఆమెను అడిగి తెలిసికొంది ఇట్లా అన్నదట—

"ఏమిటోనమ్మా! శారదమ్మా! రెండు రోజుల్నుంచీ కలలో దెయ్యం కనబడి బెదిరిస్తూ వుంది. 'ఇల్లు ఖాళీ చేస్తావా? లేదా? లేకపోతే నీ కుటుంబాన్ని సర్వనాశనం చేస్తాను' అంటూంది. మీ ఇంటిని వొదిలి మా ఇంట్లో చేరింది నాకు చచ్చే భయంగా ఉంది వెంటనే మార్చిస్తున్నాను."

మా శారద సందేహంగా అన్నది:

"మనం కూడా ఇల్లు మారిస్తేనే మంచిదండి! ఆ ఇంట్లో చేరిన దయ్యం-వాళ్లు లేకపోతే మళ్ళీ మన ఇంట్లోకి వొస్తుందేమో!"

మా శారద అమాయకత్వానికి నాకు పొట్ట పగిలే నవ్వు వొచ్చింది.

"ఒకసారి దయ్యం మనకు జడిసి పారిపోయిందంటే—మళ్ళా మనింటికి వొస్తుందా? రాదు. మనం ఇల్లు మార్చనక్కర్లేదు దెయ్యం పారిపోయిందిగా!" అన్నాను నేను ★

---

# నాటివిందు-నేటిమందు

(5-వ పేజీ తరువాయి

పచ్చళ్ళకీ అదే, పిండివంటలకీ అదే, ఆఖరికి తలంటకీ, 'భారపాల' నాడు చంటిబిడ్డ మొహం చూపడానికీ అదే వాడుతున్నారట ఖర్మ! ఈ కాఫీలొచ్చిపడ్డాయ్; యెక్కడెక్కడి పాలూ కాఫీ హోటళ్ళకే చాలటం లేదు ఇంకా వెన్నెక్కడిది? నెయ్యెక్కడిది?

పోనీ యెలాగూ తప్పటంలేదు; ఈ హోటలువాళ్ళు ఆ వనస్పతి కంపెనీ పేరైనా వుంచుతున్నారా అంటే, అదీ లేదు "అబ్బే! నెయ్యండీ-వెన్న కాచిన నెయ్యి!" అని డబాయిస్తాడుగాని "డాల్డా' అని వాడి నోటితో వాడు ఛస్తే ఒప్పుకోడు

పాడిపంటలున్న పల్లెటూళ్లల్లోకూడా నెయ్యి కరువైంది. ఇంట్లోవున్న పాలూ పెరుగూ ఆడవాళ్ళే అమ్మిపారేస్తున్నారు, మగవాళ్ళకి తెలియకుండా, (తెలిసినా వాళ్ళేం చెయ్యగలరులెండి) ఎందుకనీ? అంటే ఏముంది, వాళ్ళకి మగవాళ్ళు డబ్బులివ్వరుగనుక; వాళ్ళకి కావలసిన చీరలూ, నగలూ కొనుక్కోవలెగనుక ఇవ్వన్నీ మగవాళ్ళ నడిగితే కొనిపెట్టరా?

"ఉఁహుఁ" అంటారు వాళ్ళు

అబద్ధం! చీరెలూ, సారెలూ కొనిపెట్టకుండా యెమగాడుంటాడు?—మరి యెందుచేత?

. వాళ్ళకి "నచ్చిన" చీరెలు కావాలి; "నలుగురూ మెచ్చే" జాకెట్లు కావాలి.

—ఈ "నచ్చటం", "నలుగురూ మెచ్చటం" అనే పదాలు ఆడవాళ్ల విషయంలో వున్నంత ప్రమాదకరంగా యింకెక్కడా వుండవు. అసలు ఆడవాళ్ళకి మనస్ఫూర్తిగా నచ్చటమనేది యెడొక్కజన్మానా వుండదు అనవాకాలగతి తప్పనడిచి, యేనాడైనా యే చీర గుడ్డో రవికగుడ్డో నచ్చినా, ఆ పక్కింటి సుబ్బాయమ్మో, యెగురింటి వెంకాయమ్మో "ఎబ్బే" అన్నారంటే .... గోవిందా—గోవిందా!

"క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్ .." అందుకే మన బ్రతుకు లిలా యేడుస్తున్నాయి.

* * •

భోజనప్రసక్తి వస్తే శ్రీనాథుడికి మహదానందం, అతి శ్రద్ధ! అదీ, యిదీ అనకుండా రకరకాలూ వడ్డించేస్తాడు, ఆపద్యాల్లో నే అంతటితో సంతృప్తిపడక. "ఇవ్విధంబున నాజ్యధారాప్రవాహంబును, శర్కరాక్షోద సికతాంచితంబును, బాయసాపూప సంపన్నంబును, కలమాన్నపూర్ణంబును, ద్రాక్షాగక్షీర క్షేద్రపుంద్రేక్షుఖండమండితంబును, రంభానారికేళీ ఫలశాకపాక సాకల్య కల్యంబును, పాడబరసావళీ పానక ప్రచురంబును, శరచ్చంద్రికా ధవళదధిసమృద్ధంబునైన భోజనోత్సవంబు . అస్మన్మనోరథవిహార ఘంటాపథంబుపై ప్రవర్తిల్ల" అంటూ వర్ణనంలో కూడ మరొక్కమారు తనివి తీర్చుకుంటాడు.

భోజన మొక్కటేనా? భోజనం వడ్డించే అరటాకులు కూడా అతి శ్రద్ధగా వేయిస్తాడు సుమా!

"మొగి విరిసి కఱకు గూడక
పగులక వెడలుపును నిడుపు బసిమియుగలతే
జిగురరటాకులు పెట్టిరి
దిగ దిగ నద్దేవి యాజ్ఞ దివ్యపురంధ్రుల్"

ఆకుల చివళ్లు త్రుంచరాదట; పెళుసుగా వుండకూడదు, పగిలిపోరాదు, పొడవు, వెడల్పు, పసిమి వుండాలి—ఇంతెందుకు? చూస్తే ముద్దొచ్చేటట్లు వుండాలి

.. నిజమే! అలాంటి భోజనం గురించి తల్చుకుంటుంటే నాకు నోరూరుతోంది, పదార్థాలన్నీ పూర్తిగా తినలేకపోయినా, కనీసం రుచి చూడాలనిపిస్తోంది కాని యేం ప్రయోజనం? ఎక్కడుందా భోజనం! శ్రీనాథుడితోనే వెళ్ళి పోయింది...

మహానుభావుడు! ఎన్ని గ్రంథాలు వ్రాసి ఎంతకీర్తి సంపాదించుకున్నా, యిలాంటి భోజనాలు పెట్టించి మూట కట్టుకున్న పుణ్యంతో సరిరాదు! ★